ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 21.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 30 ఆగస్టు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	2,88,545	2,88,545
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	10,700.88	10,400.36
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.766 (39.4563)	2,70,660	2,13,987

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

పీఏసీఎస్‌ల సీఈవోల బదిలీలకు

హైకోర్టు బ్రేక్



- తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు
- సొసైటీల్లో కొనసాగుతున్న అనిశ్చితి
- డీఫాల్టర్‌గా ఉన్న సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లు?
- పాలకవర్గాల గడువు పెంపుపై ఇంకా సందిగ్ధమే



ప్రాథమిక సహకార సంఘాల్లో ఏళ్లతరబడి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న సీఈవోలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారులు నాలుగు రోజుల క్రితం బదిలీ చేశారు. అయితే బదిలీ అయిన సీఈవోలు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో బదిలీలకు శుక్రవారం బ్రేక్‌లు వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తాత్కాలికంగా బదిలీలు నిలుపుదల చేసిన హైకోర్టు అక్టోబరు 7వ తేదీ నాటికి కేసును వాయిదా వేసింది. ఈలోగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది.సీఈవోల బదిలీలను తాత్కాలికంగా నిలిపివేసిన హైకోర్టు ఆరు నెలల పాటు బదిలీలను నిలుపుదలచేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో బదిలీలు అయిన సీఈవోలంతా పూర్వ సొసైటీల్లోనే మళ్లీ పనిచేయాల్సి ఉంటుంది.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో 108 సొసైటీలు ఉండగా, 74 మంది సీఈవోలను బదిలీ చేశారు.మూడు దశాబ్దాలకు పైగా ఒకే ప్రాంతంలో పనిచేసిన వారిని బది లీ చేయడంతో వారు కోర్టును ఆశ్రయించారు. నల్లగొండ జిల్లాలో 27మంది సీఈవోలను, సూర్యాపేట జిల్లాలో 28మందిని, యాదాద్రి జిల్లాలో 20మంది సీఈవోలను అధికారులు బదిలీ చేశారు.అయితే హైకోర్టు ఉత్తర్వులతో వారి బదిలీలు నిలిచిపోయాయి.

ఎలాంటి సౌకర్యాలు లేకుండా బదిలీలా?

తమకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా బదిలీలు చేయడం అన్యాయమంటూ పీఏసీఎస్ సీఈవోలు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. పీఆర్సీ అమలు చేయడం లేదని, పదవీ విరమణ ప్రయోజనాలు ఏమిటన్నది కూడా స్పష్టత లేదని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. సుమారు 30 నుంచి 40 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్న తమను ఇప్పుడు బదిలీ చేస్తే ఉద్యోగ విరమణ సందర్భంగా రావాల్సి ప్రయోజనాలు ఏ సంఘం నుంచి తీసుకోవాలన్నది తెలియడం లేదని, వాటిపై స్పష్టత ఇచ్చాకే బదిలీ చేయాలని సీఈవోలు కోరుతున్నారు. కోర్టు స్టేతో బదిలీ అయిన కార్యదర్శులు ఇప్పడు వారు పనిచేస్తున్న సంఘాల్లోనే కొనసాగనున్నారు.

సొసైటీల పాలకవర్గం గడువు పెంపుపై అనిశ్చితి

రాష్ట్ర వ్యాప్తంగా డీఫాల్టర్‌గా ఉన్న సొసైటీల్లో చైర్మన్లకు బదులు స్పెషల్ ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం జీవోలో తిరకాసు పెట్టింది. దీంతో డీఫాల్టర్ సొసైటీలో ఉన్న వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఏ సొసైటీకి స్పెషల్ ఆఫీసర్ వస్తారు? ఏ సొసైటీలో చైర్మన్‌కు బాధ్యతలు ఇస్తారనే దానిపై అయోమయం నెలకొంది. జిల్లా సహకార అధికారులకే ప్రభుత్వం ఈ అధికారాన్ని కట్టబెట్టగా, డీఫాల్టర్ సొసైటీల వివరాలను పంపించాలని ఆదేశించింది. దీంతో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సుమారు రూ.3వేల కోట్ల టర్నోవర్‌తో సాగుతున్న నేపథ్యంలో ఎక్కడైనా సొసైటీలు డీఫాల్టర్‌గా ఉన్నట్టు ప్రకటించాలంటే పలు కోణాల్లో విచారణ చేయాల్సి ఉంటుంది.

దీంతో సాధ్యాసాధ్యాలపై జిల్లా సహకార అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎన్ని సొసైటీలు లోన్ రికవరీ చేయకుండా ఉన్నాయి? ఏ సొసైటీ పనితీరు అట్టడుగున ఉందనే దానిపై జిల్లా సహకార అధికారులు సమీక్ష చేస్తున్నా, ఆ వివరాలన్నింటినీ గోప్యంగానే ఉంచుతున్నారు. ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక సమర్పించాల్సి ఉన్నా, ఇంకా ఆదేశాలు రాకపోవడంతో నివేదిక ఆలస్యమైనట్టు సమాచారం. వారం రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లకు సంబంధించి ప్రస్తుతం కొనసాగుతున్న చైర్మన్లకే బాధ్యతలు అప్పగించడంతో పాటు ఆ పాలకవర్గాలు యథావిధిగా కొనసాగుతాయని చర్చ సాగుతోంది.

కార్యకలాపాలు ఎలా?

ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలల పాటు పాలక వర్గాల గడువును పొడిగించాలని నిర్ణయించి ఈనెల 14న ఆరు నెలల గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లా సహకారశాఖ నుంచి అనుబంధంగా

- మిగతా 6వ పేజీలో...

కలెక్టరేట్ గ్రౌండ్ ఫ్లోర్‌ను

డిసెంబరులోగా పూర్తిచేయాలి

భవనం మొత్తాన్ని వచ్చే ఏడాది జూన్ 2 నాటికి పూర్తిచేయాలి



కలెక్టరేట్ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ నూతన భవన గ్రౌండ్ ఫ్లోర్‌ను డిసెంబరులోగా, మొత్తం భవనాన్ని వచ్చే ఏడాది జూన్ 2 నాటికి పూర్తి చేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాత కలెక్టరేట్ వెనుక నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 82వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో నిర్మిస్తున్న ఈ భవనంలో పూర్తిగా రెవెన్యూ విభాగం, కలెక్టర్, అదనపు కలెక్టర్ల ఛాంబర్లు, మంత్రి ఛాంబర్ ఉండాలన్నారు. పాత భవనంలో పూర్తిగా అన్ని శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, అందుకు ఆధునీకరించాలని ఆదేశించారు. కొత్త కలెక్టరేట్‌లో మీటింగ్ హాల్‌ను ఫాల్ సీలింగ్, ఎల్ఈడీ స్క్రీన్లు, అన్ని సౌకర్యాలతో నిర్మించాలన్నారు. నిర్మాణ అంచనాలను ఎట్టి పరిస్థితుల్లో మార్చకూడదని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి నిలపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. కొత్త కలెక్టరేట్ మిగతా జిల్లాల్లో ఉన్న సమీకృత కలెక్టరేట్ భవనాకలంటే మెరుగ్గా ఉండాలన్నారు. ఈ కార్యాలయ నిర్మాణం పూర్తయితే ఇంతకాలం ఇతర భవనాల్లో ఉన్న డీఈవో, డీఎంహెచ్‌వో కార్యాలయాలను ఇక్కడికి తరలిస్తామన్నారు. అనంతరం బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాహెబ్ దర్గా గుట్టలపై నిర్మిస్తున్న ఘాట్ రోడ్ల పనులను ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. ఘాట్ రోడ్ల నిర్మాణం ఇప్పటివరకు 5కిలోమీటర్లు పూర్తయిందని ఆర్అండ్‌బీ అధికారులు మంత్రికి వివరించారు. సాధ్యమైనంత త్వరగా వీటి నిర్మాణాలను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్అండ్‌బీ సీఈ వెంకటేశ్వరరావు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై

అభ్యంతరాలు తెలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల దృష్ట్యా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30లోగా తెలియజేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 28న పోలింగ్ కేంద్రాలు, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించామన్నారు. వీటిపై అభ్యంతరాలను ఈ నెల 30వ తేదీ వరకు సమర్పిస్తే 31న పరిశీలించి, పరిష్కరిస్తామని, తుది ఓటర్ జాబితాను సెప్టెంబరు 2న ప్రకటిస్తామన్నారు. 30న ఎంపీడీవోలు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో 869 పంచాయతీలు ఉండగా, 7,444 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 10,73,506 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 600 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే మరి కొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పలు పార్టీల ప్రతినిధులు కంచర్ల భూపాల్‌రెడ్డి, మల్లికార్జున్, పంకజ్‌యాదవ్, పిచ్చయ్య, లింగస్వామి, యాదగిరి, రఫీక్, నర్సిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లు చేయాలి

సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్



సాగర్‌లోని దయ్యాలగండి వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, వేములపల్లి, హాలియా, నాగార్జునసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జన ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి డివిజన్ పరిధిలోని గణేశ్ విగ్రహ నిమజ్జన ప్రాంతాలైన దామరచర్ల మండలం వాడపల్లి, వేములపల్లి మండల కేంద్రం, అనుముల మండలం 14వ మైలు, పెద్దవూర మండలం నాగార్జునసాగర్ దయ్యాలగండి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సజావుగా సాగేందుకు పారిశుధ్యం, తాగునీరు, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణతో పాటు భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసమూహ నిర్వహణ కోసం పోలీస్ సిబ్బందిని, అత్యవసర అవసరాల కోసం వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం నిర్వహణకు చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, పోలీస్‌సిబ్బంది, విద్యుత్, ఆర్అండ్‌బీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రాప్ సర్వే పక్కాగా నిర్వహించాలి : జేడీఏ

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ క్రాప్ నమోదును పకడ్బందీగా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఘనపురంలో డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సర్వే నెంబర్‌లోని పంటల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సర్వేకు రైతులు సహకరించి పూర్తి సమాచారం అందించాలన్నారు. రైతులకు త్వరితగతిన కావలసినంత యూరియా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు రెండో విడత నానో యూరియాను వినియోగించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి రావుల పాండు, విస్తరణ అధికారి సర్దార్, రైతులు శ్రీనివాస్‌రావు, భద్రయ్య, సాయిలు, యాహన్, తదితరులు ఉన్నారు.

బత్తాయి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



నిడమనూరు : బత్తాయి తోటలను పరిశీలిస్తున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

నిడమనూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఏ.కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుంటిపల్లి, ఎర్రబెల్లి గ్రామాల్లో రైతు కమిషన్ సభ్యులు పర్యటించి బత్తాయి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు కమిషన్ సభ్యులకు ఏకరువు పెట్టారు. నాణ్యమైన మొక్కలు లభించక సరైన దిగుబడి రావడం లేదని, బిందు సేద్య పరికరాలు సైతం రాయితీపై అందడం లేదని, వివిధ రకాల తెగుళ్ల కారణంగా ఎన్ని మందులు పిచికారీ చేసినా నివారించలేకపోతున్నామని వాపోయారు. మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నామని వివరించారు. తిరుపతి నుంచి తెచ్చుకున్న మొక్కలు నాణ్యంగా లేవని, కాయ పరిమాణం రాకముందే రాలిపోతున్నాయని తెలిపారు. మొక్కలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, బత్తాయి రైతుల సమస్యలపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. తొలుత రైతు కమిషన్ బృందానికి తహసీల్దార్ జంగాల కృష్ణయ్య స్వాగతం పలికారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, భూమి సునీల్, భవానిరెడ్డి, కేఎల్ఎన్‌రెడ్డి, బాబు, జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి, ఏడీఏ సరిత, ఏవో మునికృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఏఈవో మహేష్, ఉద్యాన అధికారులు రిషిత, అనంత రెడ్డి, మురళి, శ్వేత, విద్యాసాగర్, నసీమా, నాయకులు నందికొండ మట్టారెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, నూకల వెంకట్‌రెడ్డి, నర్సింగు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన బృందం

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి పంచాయతీలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నారింజ, ఉద్యాన పంటల పరిశోధనల గురించి సీనియర్ సైంటిస్ట్ రాజాగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. నారింజ, నిమ్మ, పామాయిల్ సాగులో సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి యుగంధర్, రైతు సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

పాఠశాలల్లో సాయంకాలం తరగతులు నిర్వహించాలి



ఉరుమడ్లలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

డీఈవో బొల్లారం భిక్షపతి

చిట్యాలరూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్ల పట్టు సాధించేదుకు ప్రభుత్వ పాఠశాలల్లో సాయంకాలం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఉరుమడ్ల, ఎలికట్టె జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి గణితం, హిందీ, సామాన్య సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీ, తరగతుల నిర్వహణ ప్రణాళికలను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం పెంపుపై దృష్టిసారించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను తప్పనిసరిగా అభ్యసించడమే గాక, వాటిపై ప్రగతిని సాధించేందుకు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, నర్సింహ, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం నెరవేర్చాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఉద్యోగ, కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్, డీపీవోకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమ్మె సమయంలో వాటిని తీరుస్తామని చెప్పిన నేడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు సెలవు ఇవ్వకుండా అధిక పని గంటలతో స్పెషల్ ఆఫీసర్లు వేధిస్తున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 2న ఎంపీడీవో కార్యాలయాల ఉదుట ధర్నాలు నిర్వహిస్తామని, భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు ఎండి.సలీం, మల్లు గౌతమ్‌రెడ్డి, పోలే సాంబయ్య, అవుట రవీందర్, పోలే సత్యనారాయణ, ముత్యాలు, అంజయ్య, సర్వయ్య, జహీర్, అరుణ, జానయ్య, రామలింగయ్య, ఎల్లేష్, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై

ప్రభుత్వాన్ని నిలదీస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ పార్టీని సంప్రదించి వారి కష్టాలను అసెంబ్లీలో ప్రస్తావించాలని, ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరుతున్నారన్నారు. నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్‌తో పాటు నిరుద్యోగ భృతి, విద్యార్థినులు స్కూటీలు, రైతులు రుణమాఫీ, రైతు భరోసా, యూరియా కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరుతున్నారన్నారు. కాళేశ్వరం నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో పెడితే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, తాము మొదటి నుంచి కాళేశ్వరానికి సంబంధించిన అసలు నివేదికను బహిరంగపరచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఓ వైపు రాష్ట్రంలో వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వానికి సోయి లేదని, వరదల సమయంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి పాత పద్ధతుల్లో రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మోసం బయట పడనుండటంతో మరో డ్రామాకు తెరదీసిందన్నారు. హైకోర్టు మూడు నెలల సమయం ఇస్తే రెండు నెలలు నిద్రపోయి ఇప్పుడు హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల కమిషన్ సైతం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, వర్షాలు వస్తుంటే సమగ్రంగా లేని ఓటర్ జాబితాను ప్రదర్శించి ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. గోదావరి, కృష్ణా జలాలు వందలాది టీఎంసీలు సముద్రంలో కలుస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని, నల్లగొండలోని ఉదయ సముద్రానికి నీరు విడుదల చేయడం లేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా మంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. విలేకరుల సమావేశంలో నాయకులు రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, తుమ్మల లింగస్వామి, పాల్గొన్నారు.

నిరీక్షించినా నిరాశే..

- యూరియా కోసం పలుచోట్ల ఆందోళన

7

వినూత్నం.. విఘ్నేశం

- ఆకట్టుకునే అలంకారాల్లో వినాయక మండపాలు
- వివిధ రూపాల్లో గణనాథులు
- సినిమా సెట్టింగ్‌లను తలపిస్తూ అలంకరణలు

నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుల ప్రతిమలు, మండపాలు ఆకట్టుకుంటున్నాయి. సినిమా సెట్టింగ్‌లను తలపిస్తున్నాయి. వివిధ పక్షులు, విద్యుత్ ఉపకరణాలతో వినాయకులను తీర్చిదిద్దారు.


భువనగిరి గంజ్ బాలవినాయక యూత్ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ఉపకరణాలు


భువనగిరిలో మణికంఠ యూత్ అసోసియేషన్ మండపంలో మంచుకొండల మధ్య కత్తిపట్టుకున్న గణనాథుడు


భువనగిరిలో వివిధ ఆభరణాలతో ఆకట్టుకునే రూపంలో గణనాథుడు


భువనగిరిలో గంజ్‌లో 10 నాగపడగల మధ్య విఘ్నేశ్వరుడు


సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలోని మల్లికార్జున ట్రేడర్స్ యజమాని తీగుల్ల మల్లేష్, అతడి స్నేహితుడు కుదురుపాక శ్రీను కలిసి ప్లాస్టిక్ పైపులతో తయారు చేసిన వినాయకుడు.


భువనగిరిలో శ్రీసాయి యూత్ ఆధ్వర్యంలో డేగ కన్నుల మధ్య గణేషుడు


భువనగిరి వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన భారీ గణనాథుడు

నిద్రించే స్థలంపై వివాదంతో వ్యక్తి హత్య


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నిద్రించే స్థలంపై వివాదం ఓ వ్యక్తి హత్యకు దారితీసింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 27వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కె.శివరాంరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ జిల్లా భద్రావతి తాలుకాకు చెందిన షేక్ సిరాజ్ అదే రాష్ట్రానికి చెందిన హుస్సేన్ వద్ద లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. నెల రోజుల క్రితం లారీలో లోడు తీసుకొని నల్లగొండకు వస్తున్న సమయంలో డ్రైవర్‌తో గొడవపడ్డాడు. దీంతో డ్రైవర్ సిరాజ్‌ను నల్లగొండలో దింపివేసి వెళ్లిపోయాడు. ఈ ఘటన అనంతరం సిరాజ్ నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద ప్రతీరోజు రూ.5 భోజనం చేస్తూ చుట్టు పక్కల అడుక్కుంటూ క్యాంటీన్ వద్దనే నిద్రించేవాడు.

వివాదం మొదలైందిలా..

ఈ నెల 27వ తేదీ రాత్రి 10గంటల సమయంలో సిరాజ్ పడుకునే స్థలంలో అతని పట్టాపై నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చింతకింది రమేష్(40) నిద్రించాడు. తాను రోజూ నిద్రించే స్థలంలో ఎందుకు నిద్రించావని ప్రశ్నించిన సిరాజ్‌తో ఘర్షణకు దిగిన రమేష్ దాడిచేశాడు. రమేష్ ఆ సమీపంలోనే నిద్రిస్తుండటంతో, గంట సమయం అనంతరం అక్కడికి వెళ్లిన సిరాజ్ మొనదేలిన గ్రానైట్ రాయితో రెండు చేతులు, తలపై బలంగా మోదాడు. రాయిని కళాశాల గోడ వెనుక విసిరేసి అక్కడినుంచి పారిపోయాడు. హత్య సంఘటన తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సీసీ కెమెరాల సాయంతో నిందితుడి వివరాలను సేకరించారు. హత్యకు ఉపయోగించిన బండరాయితో పాటు రక్తపు మరకలు ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించారు. హత్య జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించిన నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో పాటు ఎస్‌ఐ వెంకటనారాయణ, ఏఎస్‌ఐ వెంకట్ యాదవ్, సిబ్బంది రబ్బానీ, షకీల్, శ్రీకాంత్, శంకర్, జానకిరాములు, సైదులును జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఎనిమిది వ్యవసాయ మోటార్లు స్వాధీనం


నిందితులతో పాటు వారి నుంచి స్వాధీనం చేసుకున్న మోటార్లతో పోలీసులు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలలుగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రాజవరం మేజర్ కాల్వ పక్కన ఉన్న వ్యవసాయ భూముల్లో మోటార్లను దొంగిలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం సాగర్ సర్కిల్ సీఐ శ్రీనునాయక్, ఎస్‌ఐ వీరశేఖర్‌లు నిందితులను కోర్టులో రిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొంతకాలంగా జానారెడ్డికాలనీకి చెందిన జటావత్ కిట్టు, పంగవాని కుంటకు చెందిన కటికర్ల మురళి, పెరిక అభినయ్, గణేష్, బోనూతలకు చెందిన కంచర్ల రాజ్‌కుమార్, రంగుండ్లకు చెందిన సపావత్ భగవాన్, హాలియాకు చెందిన వేముల యోబు ముఠాగా ఏర్పడి పొలాల వద్ద రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా మోటార్లను దొంగిలిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిఘా పెట్టిన పోలీసులు శుక్రవారం మండలకేంద్రానికి సమీపంలో వీరిని పట్టుకుని విచారించిన అనంతరం కేసు నమోదుచేశారు. ఈ క్రమంలో వారి నుంచి రూ.1.35లక్షల విలువ చేసే 8 వ్యవసాయ మోటార్లతో పాటు ఒక పల్సర్ బైక్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో పంగవాని కుంటకు చెందిన గణేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు, జరిమానా

మోత్కూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు శివారులోని మూసీనది ఒడ్డున 2023లో జరిగిన హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్‌కోర్టు జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన చల్ల ధనమ్మకు తన తల్లిగారి ఊరైన శాలిగౌరారం మండలం గురిజాల గ్రామానికి చెందిన ఎడ్ల నవీన్‌తో వివాహేతర సంబంధం ఉంది. దాంతో భార్యాభర్తలు చల్ల ధనమ్మ, సైదులు మధ్య తరచుగా గొడవలు జరిగేవి. 2023 ఆగస్టు 9న ధనమ్మ బోనాల పండుగకు శాలిగౌరారం మండలం గురిజాలలోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. రెండు రోజులకు ఆగస్టు 11 ఆమె భర్త సైదులు అక్కడకు వెళ్లి తనకు చెప్పకుండా ఎందుకు వచ్చావంటూ ఆమెతో గొడవపడ్డాడు. తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భావించిన ధనమ్మ తన ప్రియుడు గురిజాల గ్రామానికి చెందిన ఎడ్ల నవీన్, మరొక వ్యక్తి తాటిపాముల స్వామితో కలిసి భర్త సైదులును హత్య చేసి శవాన్ని మోత్కూరు మండలం పొడిచేడు గ్రామ శివారులో మూసీ నది ఒడ్డున పడేశారు. అప్పటి రామన్నపేట సీఐ మోతీరాం ఆధ్వర్యంలో అప్పటి ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను పట్టుకుని చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా సెషన్సు కోర్టు జడ్జి కేసు విచారణ జరిపి సాక్షులను విచారించి నేరం రుజువుకావడంతో భర్తను హత్య చేసిన ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన ధనమ్మకు జీవిత ఖైదు, రూ.20 వేలు జరిమానా, శాలిగౌరారం మండలం గురిజాల గ్రామానికి చెందిన ఎడ్ల నవీన్‌కు జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా, తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన తాటిపాముల స్వామికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధించారని మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

‘పేట’ నగల దుకాణం చోరీలో మరొకరి అరెస్ట్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తుల్లో ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.25 లక్షల విలువైన 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.4.84 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ వెల్లడించారు. సూర్యాపేటలోని శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో జూలై 20వ తేదీ అర్ధరాత్రి చోరీ జరగ్గా, సుమారు రెండున్నర కిలోల బంగారు ఆభరణాలతో పాటు కొంత మొత్తంలో నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. దుకాణ యజమాని కిశోర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఖమ్మం పట్టణానికి చెందిన యశోద జూలై 27న సూర్యాపేట కొత్తబస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నగల దుకాణంలో చోరీచేసిన వ్యక్తుల గురించి సమాచారం తెలిపింది. వారిచ్చిన 14 తులాల బంగారు ఆభరణాలను విక్రయించేందుకు వెళ్తున్నట్లు తెలిపింది. దీంతో ఆ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఇచ్చిన సమాచారంతో చోరీలో ఆరుగురు భాగస్వామ్యమైనట్లు గుర్తించారు. నేపాల్ దేశానికి చెందిన ప్రధాన నిందితుడు ప్రకాష్‌అనిల్‌కుమార్‌తో పాటు అదే దేశానికి చెందిన కడక్‌సింగ్ అహ్లావాలియా, పురన్‌ప్రసాద్ జోషి, అమర్‌బట్, పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన మాలిక్ మొల్ల, జహిముద్దీన్‌లు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ నెల 11న పశ్చిమబెంగాల్ రాష్ట్రం దక్షిణ్ దినాజ్‌పూర్ జిల్లా బైహోర్ గ్రామం తపన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాలిక్‌మొల్లను అతడి స్వగ్రామంలో అదుపులోకి తీసుకుని, అతడి నుంచి సుమారు రూ.60లక్షల విలువైన 554 గ్రాముల ఆభరణాలు, రూ.87,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అక్కడి నుంచి ఈ నెల 16న రాష్ట్రానికి తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించారు. అదేవిధంగా మరో నిందితుడు నేపాల్ దేశానికి చెందిన, ఖమ్మంలో గుర్ఖాగా పనిచేసే అమర్‌భట్‌ను ఈ నెల 16న ఖమ్మంలో అదుపులోకి తీసుకుని అతడి నుంచి రూ.5వేల నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. నిందితుడు మాలిక్ మొల్ల ఇచ్చిన సమాచారంతో ఈ నెల 26న పశ్చిమబెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లా ఒకేరాచాంద్‌పరా మండలం అందారు గ్రామంలో మరో నిందితుడు జహిముద్దీన్‌ను అరెస్ట్ చేశారు. అతడినుంచి సుమారు రూ.25లక్షల విలువైన 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.4.84లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

జహిముద్దీన్ తన వాటాకు వచ్చిన ఆభరణాలు, నగదులో కొంత మొత్తాన్ని విక్రయించి జల్సాలకు ఖర్చు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ నెల 29న సూర్యాపేటకు తీసుకువచ్చినట్లు ఎస్పీ తెలిపారు. జహిముద్దీన్‌పై గూర్గం పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసు నమోదై ఉందన్నారు. ఇంకా చోరీ కేసులో నేపాల్‌కు చెందిన ప్రధాన నిందితుడు ప్రకాష్‌అనిల్‌కుమార్, కడక్‌సింగ్ అహ్లావాలియా, పురన్‌ప్రసాద్‌జోషి పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో సూర్యాపేట పట్టణ, సీసీఎస్, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, శివకుమార్, లక్ష్మీనారాయణ, సీసీఎస్, పట్టణ, పెన్‌పహాడ్ ఎస్‌ఐలు హరిక్రిష్ణ, శివతేజ, గోపీకృష్ణ, ఐటీ సెల్ ఆర్ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది చనగాని వెంకన్న, గొర్ల క్రిష్ణయ్య, గోదేశి కర్ణాకర్, శ్రీరాములు, జహంగీర్, జోగు సైదులు, మల్లేష్, సుధాకర్, నవీన్, నరేందర్, శ్రావ్య తదితరులు ఉన్నారు.

బ్యాంకులో డబ్బు దొంగిలించిన ఏడుగురి అరెస్ట్

నకిరేకల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌కు వచ్చిన ఖాతాదారుడి నుంచి రూ.2.32 లక్షలు చోరీ చేసిన ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా యాగర్లపల్లి మండలానికి చెందిన పట్నాల పోలమ్మ, పోరిపిరెడ్డి చాందిన, పురుపురెడ్డి నాగ, యరసాని సంధ్య, పురుపురెడ్డి మోషే, ఓ బాలిక, బాలుడు ఈ నెల 25వ తేదీన నకిరేకల్ కోఆపరేటివ్ బ్యాంక్‌కు వచ్చారు. మండలంలోని నడిగూడెం గ్రామానికి చెందిన మాద నాగరాజు అనే ఖాతాదారుడు బ్యాంక్ గోల్డ్‌లోన్ క్లియర్ చేసేందుకు రూ.2.32 లక్షలు కవర్‌లో తీసుకుని వచ్చి ఓచర్ రాస్తుండగా నిందితులు అతడితో మాట్లాడుతూ బ్లేడుతో కవర్‌ను కోశారు. అందులోని నగదును తీసుకుని నుంచి పరారయ్యారు. నాగరాజు ఓచర్ రాసిన అనంతరం చూసేసరికి డబ్బులు లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు నకిరేకల్ పోలీస్ సిబ్బంది హుటాహుటిన తనిఖీలు ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీన సోమవారం రాత్రి 10 గంటల సమయంలో హైవేపై ఉన్న నగేష్ హోటల్ వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా కారులో వస్తున్న ఏడుగురిని విచారించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణలో నకిరేకల్ బ్యాంక్‌లో దొంగతనం చేసింది తామేనని ఒప్పుకున్నారు. డబ్బులు తీసుకుని విజయవాడకు వెళ్లి కనకదుర్గమ్మ గుడిలో పడుకుని మరుసటి రోజు విజయవాడలోనే ఉండి 3వ రోజు కోదాడ బస్టాండ్‌లో పడుకున్నామని మళ్లీ ఎక్కడన్నా దొంగతనం చేయాలన్న ఉద్దేశ్యంతో చిట్యాల, చౌటుప్పల్‌కు వెళ్లేందుకు నిర్ణయించుకున్నామని నిందితులు తెలిపినట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి రూ.2.32లక్షలు, ఎర్టీగా కారు, రెండు సెల్‌ఫోన్లు, బ్లేడు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ వెంకటేష్, ఎస్‌ఐలు లచ్చిరెడ్డి, కృష్ణాచారి, సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీకాంత్, సురేష్, జనార్ధన్, మధూకర్, లక్ష్మిలను ఎస్పీ అభినందించారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు

విద్యుదాఘాతంతో ముగ్గురికి గాయాలు

నకిరేకల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి ముగ్గురు మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికులు నల్లగొండ శోభ, వంటెపాక నాగరాజు, వంటెపాక సబితలతో పాటు మరో ముగ్గురుకార్మికులు స్థానిక మినీస్టేడియం పక్కన ఉన్న జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చెత్తాచెదారం తొలగిస్తున్నారు.ఈ క్రమంలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. పాఠశాల భవనంపైకి ఎక్కి చెత్తను తొలగిస్తుండగా చెట్టు కొమ్మకు విద్యుత్‌లైన్ తీగ తగలడంతో వారు గుర్తించకుండా చెట్టును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయారు. గమనించిన మిగతా కార్మికులు వెంటనే మునిసిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారిని ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శోభను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులను మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితాశ్రీనివాస్, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధైద రవీందర్, మునిసిపల్ కమిషనర్ రంజిత్‌కుమార్, కౌన్సిలర్ గాజుల సుకన్య, ఏఈ గౌతమ్, విద్యుత్ ఏఈ సాయిగణేష్ పరామర్శించారు.

వాగులో పడి వ్యక్తికి గాయాలు

ఆలేరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా కొలనుపాకలో వాగులో పడి వ్యక్తికి గాయాలయ్యాయి. కొలనుపాక గ్రామానికి చెందిన ధర్మ శ్రీనివాస్‌రెడ్డి తన ద్విచక్రవాహనంపై శుక్రవారం కొలనుపాక నుంచి ఆలేరు పెద్దవాగు వద్ద దాటే ప్రయత్నం చేశాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అదుపు తప్పిపోయాడు. గమనించిన గ్రామస్థులు కాపాడారు. శ్రీనివాస్‌రెడ్డిని చికిత్సకోసం ఆలేరులోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువకుడి అనుమానాస్పద మృతిపై వీడిన మిస్టరీ

ట్రాక్టర్ ప్రమాదమే కారణమని తేల్చిన పోలీసులు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఇందిరమ్మకాలనీ రోడ్డుపై యువకుడి అనుమానాస్పద మృతి మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ నెల 17న నమోదైన కేసు వివరాలను శుక్రవారం వన్‌టౌన్ సీఐ మోతీరాం వెల్లడించారు. స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన మాదగోని ఈశ్వర్(19) పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హనుమాన్‌పేట కాలనీలోని తన అమ్మమ్మ ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుండగా దమ్ముచక్రాలతో పట్టణంలోకి ప్రవేశిస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టినట్లు తమ విచారణలో తేలిందని సీఐ తెలిపారు. నల్లగొండ మండలం కాంచనపల్లికి చెందిన గోరంట్ల రఫెల్ సొంత ట్రాక్టర్‌తో చింతపల్లి గ్రామంలో తల్లిదండ్రులు కొనుగోలు చేసిన పొలాన్ని దమ్ముచేసి ఈ నెల 17వ తేదీ రాత్రి కల్టివేటర్‌పై దమ్ముచక్రాలు, 10 అడుగుల పొడవైన ఇనుపగొర్రును వేసుకొని అతివేగంతో వస్తున్నాడు. ఎదురుగా వచ్చే వాహనాలకు కనిపించే విధంగా ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదు. ఈ క్రమంలో చింతపల్లి ఇందిరమ్మకాలనీ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ట్రాక్టర్ వెనుక భాగంలో కల్టివేటర్‌పై అమర్చిన ఇనుపగొర్రు ఢీ కొట్టింది. దీంతో ఈశ్వర్ కుడి దవడ పగిలి విచ్ఛిన్నమై గొంతు కుడివైపు భాగంలో లోతైన గాయం ఏర్పడినట్లు సీఐ తెలిపారు. దీంతో చలనం లేకుండా పడిపోయిన ఈశ్వర్‌ను చూసి బయపడిన ట్రాక్టర్ డ్రైవర్ రఫెల్ తన ట్రాక్టర్‌తో పారిపోయాడు. అయితే ప్రమాదం జరిగిన ఇందిరమ్మకాలనీ రోడ్డు పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ట్రాక్టర్ ప్రమాదంలో ఈశ్వర్ మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ నెంబరును గుర్తించి విచారించగా నేరస్తుడి వివరాలతో పాటు యువకుడి మృతి కేసుకు సంబంధించిన మిస్టరీ వీడిందని సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను సీజ్‌చేసి, సదరు వాహనాన్ని అతివేగం, అజాగ్రత్తతో నడిపి యువకుడి మృతికి కారణమైన డ్రైవర్ రఫెల్‌పై కేసు నమోదు రిమాండ్‌కు పంపినట్లు సీఐ మోతీరాం తెలిపారు.

సీఈవోల బదిలీలకు హైకోర్టు బ్రేక్

(5వ పేజీ తరువాయి)

జీవో రావాల్సి ఉండగా, 16 రోజులు గడిచినా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 107 ప్రాథమిక సహకార సంఘాల్లో రాజకీయ అనిశ్చితితోపాటు కార్యకలాపాలపై కూడా ప్రభావం పడింది. ఓవైపు సీఈవోల బదిలీలు గందరగోళానికి దారి తీయగా, శుక్రవారం హైకోర్టు ఉత్తర్వులతో బదిలీలకు బ్రేక్ పడింది. అయితే పీఏసీఎస్ పాలకవర్గాల గడువుపై మాత్రం అయోమయం నెలకొంది. డీఫాల్టర్ విషయాన్ని తెరపైకి తేవడంతో ఈ సమస్య ఎన్నటికి పరిష్కారం అవుతుందో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన వారు చాలామంది పీఏసీఎస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. ఆ తరువాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొంతమంది పార్టీ మారినా, చాలామంది బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో డీఫాల్టర్ల సమస్యను తెరపైకి తీసుకువస్తే రాజకీయంగా కొంత చర్చకు దారితీసే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో డీఫాల్టర్ల సమస్యను పరిష్కరించడం జిల్లా సహకారశాఖ అధికారులకు తలనొప్పిగా మారిందనే చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని చైర్మన్లకు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో డీఫాల్టర్లను ఎలా గుర్తించాలి? ప్రభుత్వానికి నివేదిక ఎలా సమర్పించాలి? అనే దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. బాధ్యతలు చైర్మన్లకు ఇవ్వాలా? స్పెషల్ ఆఫీసర్లకు ఇవ్వాలా? అనే దానిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మినహా, పాలకవర్గంలోని డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు మాజీలుగా మిగలనున్నారు. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పదవీకాలాన్ని పెంచింది. డీసీసీబీ డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్ల విషయంపై వచ్చే నెల 1న ప్రభుత్వం స్పష్టత ఇచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల తరువాతే సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని, పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు పెంచే అవకాశాలు లేవనే చర్చ సాగుతోంది. మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో చిత్ర విచిత్రంగా ఉండడంతో సహకార సంఘాల్లో రాజకీయ అనిశ్చితి ఏర్పడింది.

నిరీక్షించినా నిరాశే..

● యూరియా కోసం ఆందోళన ● తెల్లవారుజాము నుంచి ఎదురుచూపులు





పెద్దవూరలో రాస్తారోకో చేస్తున్న రైతులు, (ఇన్‌సెట్‌లో) పీఏసీఎస్ వద్ద పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టిన రైతులు

కొండమల్లేపల్లి, పెద్దవూర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దవూర, కొండమల్లేపల్లిలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. మండల కేంద్రాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం పీఏసీఎస్ కేంద్రాలకు చేరుకున్నారు. తెల్లవారుజామున నుంచే క్యూలైన్‌లో వేచి ఉన్నారు. పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టి నిరీక్షించారు. అధికారులు యూరియా లేదని తెలపడంతో రాస్తారోకో చేపట్టారు. పెద్దవూరలో రహదారికి రెండు వైపులా కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రాస్తారోకో వద్దకు వచ్చి రైతులను సముదాయించారు. అదే సమయంలో కాంగ్రెస్ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కోదండరెడ్డి నిడమనూరు మండలంలోని బత్తాయి తోటల స్థితిగతులను పరిశీలించడానికి వెళ్తూ ట్రాఫిక్‌లో ఆగిపోయారు. ఆయన రైతుల వద్దకు చేరి కలెక్టర్‌తో మాట్లాడి యూరియాను శనివారం అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తమ రాస్తారోకోను విరమించారు. రైతుల రాస్తారోకోకు మాజీ సర్పంచ్ నడ్డి లింగయ్య సంఘీభావం తెలిపారు. మల్లేపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దస్రూనాయక్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు తులసీరాం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఏసీఎస్ కేంద్రాల్లో యూరియా దొరకడం లేదని, కానీ ప్రైవేటుగా నిర్వహించే ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా లభిస్తుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా రైతులకు సకాలంలో యూరియా అందే పరిస్థితి లేకుండాపోయిందని అన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అజ్మీరారమేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేయించారు.

ఈ కార్యక్రమంలో రైతులతో పాటు కొత్తబావి మాజీ సర్పంచ్ జబ్బు యాదయ్య పాల్గొన్నారు.

యూరియా కొరతకు కారణం కేంద్రమే..

చండూరు: యూరియా కొరత పాపం కేంద్రానిదేనని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య ఆరోపించారు. చండూరులో సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పంట పొలాలను కాపాడుకోవడం కోసం యూరియా కోసం ఆందోళన చేస్తుండగా ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు. కేంద్రప్రభుత్వం తమ అసమర్థతతో రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు తిప్పర్తి రాములు, పల్లె యాదయ్య, చెడుబుద్ధి ఊశయ్య, దోటి వెంకన్న, అలేటి జగన్, గంట రమేష్, దశరథ, లక్ష్మీనర్సింహ, యాదగిరి, శివర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం బారులు



రాజాపేట మండల కేంద్రంలో ఎరువుల కోసం క్యూ కట్టిన రైతులు

రాజాపేట, బొమ్మలరామారం: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట, బొమ్మలరామారం మండల కేంద్రాల్లో శుక్రవారం యూరియా కోసం రైతులు సహకార సంఘం గోదాముల వద్ద బారులు తీరారు. ఉదయం 8గంటలకే రైతులు గోదాం వద్దకు చేరుకుని పాస్‌పుస్తకాలను క్యూలో పెట్టి పడిగాపులు కాశారు. రాజాపేటలో 220 బస్తాల యూరియాను రైతులకు అధికారులు పంపిణీ చేసినట్లు ఏవో పద్మజ తెలిపారు. క్యూలో ఉన్న రైతులందరికీ అందకపోవడంతో కొంతమంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

● బొమ్మలరామారం సహకార సంఘం కార్యాలయానికి 250 బస్తాలే రావడంతో ఎకరానికి ఒకే బ్యాగు ఇచ్చారు. దీంతో పలువురు రైతులు ఆందోళన చేపట్టారు. మండలానికి 300 టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు సుమారు 150 టన్నులు యూరియా సరఫరా అయిందని, సెప్టెంబరు 2వ తేదీ వరకు 40 టన్నుల యూరియా సరఫరా అవుతుందని ఏవో దుర్గేశ్వరి తెలిపారు.

యూరియా అందుబాటులో ఉంచాలి



యూరియా సమస్యను పరిష్కరించాలని దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

చిట్యాల, మునుగోడు, మర్రిగూడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియాను సకాలంలో అందించటంలో ప్రభుత్వం విఫలమైందని, యూరియా అందుబాటులో ఉంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లొడంగి శ్రవణ్‌కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం అన్నారు. యూరియా కొరతను నిరసిస్తూ సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చిట్యాల, మునుగోడులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగుచేసిన పంటలకు వేయాల్సిన సమయం దాటిపోతున్నా సరిపడా యూరియా అందక బాధిత రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదును దాటిపోతుండటంతో దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను సత్వరమే సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, మండల కార్యదర్శి ఎండీ అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్కే షరీఫ్, నాయకులు దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, దేవేందర్, మునుగోడులో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మరబోయిన లాల్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బండమీది యాదయ్య, మందుల పాండు, మాజీ జడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, కైలాసం, వెంకన్న, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి సరిపడా యూరియాను మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.మైనుద్దీన్ డిమాండ్ చేశారు. దేవరకొండలో సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన 50వేల మెట్రిక్ టన్నుల యూరియాకు గాను 35 వేల మెట్రిక్ టన్నుల మాత్రమే వచ్చిందని అన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే 15వేల టన్నుల యూరియాను తెలంగాణ రాష్ట్రానికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం, సీపీఐ నాయకులు సుదర్శన్‌రెడ్డి, పల్లా రంగారెడ్డి, వెంకటయ్య, పొందు రంగారెడ్డి, రామస్వామి, యాదయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మర్రిగూడ: యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైంద ని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర శేఖర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నిర్లక్ష్యం చేస్తోంద ని ఆరోపించారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అ ధ్యక్షుడు జక్కల అంజయ్య, మాజీ జడ్పీటీసీ ప్రేమ కుమార్, నజీర్ బిక్షం రెడ్డి, కొట్టం యాదయ్య, బాలకృష్ణ రైతులు పాల్గొన్నారు.

ఏంది గీ ఎరువుల లొల్లి

- పొద్దత్తమానం పడిగాపులు కాత్తున్నం
- అడ్డగోలు మందులేసి నేల ఖరాబుచేత్తుండ్రు
- మా కాలంలోనే గివేమి లేకుండే..
- తాత - మనవడి మధ్య సంభాషణ



రచ్చబండ RACHABANDA

గీ ఏడు ముందుగనే ఆన దేవుడు కరుణ సూపిండు.. మంచిగ ఆనలు కురుత్తున్నయి.. ఎవసాయం బానే షురు అయింది.. గంత మంచిగుంది గాని గీ ఎరువుల సంగతి అంతుబట్టక పాయే.. బత్త యూరియా కోసం రోజు పొద్దత్తమానం.. ఇంట్ల పిల్ల, జెల్ల, ముసలోల్లు కాళ్లు ఆసేటట్టు నిలబడ్డా దొరుకుడు కట్ట మాయే.. గిట్ల అయితే ఎవసాయం ముందుకు పోయి నట్టే.. గీ పరిత్తితి ఎందుకొచ్చే.. ఊర్ల రచ్చ బండ కాడ తాత మనవని మధ్య ముచ్చట..గిట్ల సాగింది..

\- ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ (వ్యవసాయం)

తాత: ఏ మనవడా! మంచిగున్నవా.. గీ మధ్య కంటికి కానొత్తలేవు.. గా మధ్య రోజు రచ్చ బండ కాడికి అత్తుంటివిగా శానా రోజులాయె రాక ఎటు పోతున్నవు ఏంది..?

మనవడు: ఏం సెప్పను తాత నా కట్టాలు. ఈ సారి కూలోల్లు దొరకక ఇంటోల్లమే వరి నాట్లేసుకున్నం.... గా పని అయిపోంగనే జరంత నిమ్మలంగుందాం అనుకున్న.. గంతలోనే కొత్త కట్టాలు అచ్చినయి.. గీడికి రానీకి.. ఖాళీ లేకుండే..

తాత: ఏంది మనవడా గంత సెప్పలేని కట్టాలు ?

మనవడు: పంటకు యూరియా ఏసే టైమొచ్చే.. ఏడికి బోయిన లేదన్నరు.. తిరగని కొట్టు లేదు.. ఏడా బత్త లేదు.. గాడ అచ్చిందంటే పోయినం.. జాతరలెక్క జనం ఉన్నరు.. లైన్ల సంచులు, సెప్పులు పెట్టిండ్రు.. పొద్దత్తమానం నిలబడ్డా ఒక్క బత్త దొరక బట్టినా.. పొద్దుగల ఇంట్ల ఉన్నోళ్లందరని తోలుకుపోయినం.. వారం రోజుల నుంచి గిదే పని తాత.. గయినా సరి పోను యూరియా దొరకలే.. ఏం సేయాలే సెప్పు.. తాత

తాత: అందుకే గీ మధ్య శాన రోజులకెల్లి రచ్చబండ తాన జనం కనిపిత్తలేరు..పొలాల్ల గిట్టలేరు.. యూరియా కోసం పోతున్నరా..?

మనవడు: అవును తాత పంటకు యూరియా ఏయక పోతే పచ్చగ కాకపాయే.. ఐదేళ్ల క్రితం మూడు బత్తాలేస్తే గిపుడు ఆరు నుంచి తొమ్మిది బత్తాల దంక ఏత్తున్నం..

తాత: గీ ఎత్తున యూరియా ఏత్తే సర్కారు మాత్రం ఏం సేత్తది. సెప్పు... మా కాలంలో పంటకు పిండేసుడే తెలియకుండే ఇంట్ల ఉన్న పశుల ఎరువు ఎండ్ల బండ్ల తోలకపోయి పోత్తుంటిమి.. ఏ రోగం రాకుండా పంట మంచిగ పండేది.. నేలలో మంచి సత్తువుండే.. మట్టి తీత్తే ఏడ చూసినా వానపాములు మస్తుగా ఉండే.. గిపుడు పంటల కాడికి పోతే మందుల ఆసనొత్తుంది.. వాన పాములు సూద్దామన్నా. కానొత్తలేవ్.. నేలల గింత సత్తువ లేక పాయే..

మనవడు: పశువుల లేక ఎరువు ఏడ దొరుకుంది తాత.. ఉన్నా కొనే పరిత్తితి లేదు.. గిపుడు మస్తు పైసలు పెట్టి రకరకాల ఎరువులు ఏత్తున్నం అయినా పంట మంచిగ పండట్లే.. సాగుకు పెట్టిన పైసలు చేతికి రాట్లే.. ఏం సేయాలే సెప్పు..

తాత: గిట్టయితే.. కట్టం మనవడా. శానా ఏళ్ల కెల్లి సూత్తున్న.. కన్నతల్లంటి నేలను జీవం లేకుండ చేత్తున్నరు.. ఇంక ఏం పంటలు పండుతయి సెప్పు. ఎరువులు శానా తగ్గియాలే.. నేలకు సత్తువ ఇచ్చే చెరువు మట్టి గిట్ట మంచిగ పోసుకోవాలే.రైతన్నంక పశువులు ఉంచుకోవాలే.. పేడ భూ మిల ఏసుకోవాలే.. గపుడే భూమి మంచిగయితది.. పంటలు మంచిగ అత్తయ్..భూమిని మనం కాపాడితేనేగా అది సల్లగా సూసేది..

మనవడు: మంచిగ సెప్పినవు తాత.. నా తోని అయితదేమో సూత్త.. .గాడ యూరియా అచ్చిదంట పోయెత్త..

తాత: గీళ్లు ఎంత సెప్పినా గంతే.. మారరు గిట్టయితే ముందు తరాలకు బువ్వ దొరకుడు కట్టమయితది.. జర భద్రం.

క్రీడలతో పరిపూర్ణ మూర్తిమత్వం

● ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో పరిపూర్ణ మూర్తిమత్వం లభిస్తుందని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం మూడు కిలోమీటర్ల పరుగుపందెం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ హరీష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఉపకులపతి, జిల్లా స్పోర్ట్స్ అధికారి మహమ్మద్ అక్బర్‌అలీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంజీ యూ వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న త ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు పరిపూర్ణ మూర్తిమత్వాన్ని పెంపొందించే సాధనాలని గుర్తు చేశారు. ఎంజీయూలో క్రీడలకు సైతం రెండు క్రెడిట్లను అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వి ద్యార్థులు మొబైల్ వాడకం కన్నా దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు.

జిల్లా స్పోర్ట్స్ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ మాట్లాడుతూ ఉత్తమ సదుపాయాలు కలిగిన ఎంజీయూలో జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయాలని, అందుకు తగిన శిక్షణ, ఖేలో ఇండియా వంటి క్రీడలను నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ క్యాలెండర్, ఎంజీయూలు స్పోర్ట్స్ క్లబ్స్ ఏర్పాటుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి అధ్యాపకులు, డాక్టర్ రామావత్ మురళి, డాక్టర్ వై.శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ శివశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చిన వరద వచ్చినట్లుగా..

● సాగర్ 26 గేట్ల ద్వారా నీటి విడుదల



నాగార్జునసాగర్ 26 గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. సాగర్ ప్రాజెకు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 587.50 అడుగులు (305.8030 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 8529 క్యూసెక్కుల నీటిని, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,454 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,43,862 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,88,545 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 2,88,545 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది. సాగర్ ఎడమ కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు.

మూసీ 8 క్రస్టుగేట్లు ఎత్తివేత

కేతేపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో నాగార్జునసాగర్‌గా పేరొందిన మూసీ ప్రాజెక్టు వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం సాంయంత్రం ఇన్‌ఫ్లో 10560.36 క్యూసెక్కులుగా నమోదైంది. మరోవైపు ప్రాజెక్టు 643.60 అడుగుల గరిష్ఠస్థాయిలో ఉంచుతూ అధికారులు ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు 8 క్రస్టుగేట్లను 2 అడుగుల మేర ఎత్తి 10400.36 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 643.60 అడుగులు (4.09టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు ఆయకట్టుకు కుడి, ఎడమ కాల్వల ద్వారా 240.30 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్ ఇతర ఇంజనీరింగ్ అధికారులు మూసీ డ్యాం వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

సెప్టెంబరు 15న

ఎంజీయూ నాలుగో స్నాతకోత్సవం

● హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ప్రముఖులు



నల్లగొండటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవాన్ని సెప్టెంబరు 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఉపకులపతి ఆచార్య ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. ఎంజీయూలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథులుగా విశ్వవిద్యాలయాల కులపతి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ఆచార్య బీఎస్ మూర్తి హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన స్నాతకోత్సవ నిర్వహణ కోసం శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కమిటీల ద్వారా నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. ఈ స్నాతకోత్సవంలో పీజీ విద్యార్థులకు 57 బంగారు పతకాలు, 22 పీహెచ్‌డీ పట్టాలను అతిథులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కమిటీ సభ్యులు తమ తమ కార్యకలాపాలను ప్రారంభించి శ్రద్ధతో నిర్వహించి విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ పెంచేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, సీఈవో డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు

ఉద్యమకారులను విస్మరిస్తున్న ప్రభుత్వం

సూర్యాపేటటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరిస్తుందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కోతి మాధవి నివాసంలో శుక్రవారం ఏర్పాటు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని అధికారంలోకి వచ్చి నేడు విస్మరించిందని అన్నారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 12వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీయూజేఏసీ నాయకులు మధుసూధన్‌రెడ్డి, జోలక్ యాదగిరి, రాజేంద్రప్రసాద్, గుండాల సందీప్, మురళి, పావని, రవి, అమృనాయక్, మల్లేష్, బాబన్న పాల్గొన్నారు.

వైభవంగా గిరిప్రదక్షిణ

● భక్తుల భజనలు, కీర్తనలు ● ప్రతిధ్వనించిన దివ్యక్షేత్రం



ఆలయ ముఖ మండపంలో అష్టోత్తరశతఘటాభిషేకం



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో శుక్రవారం సామూహిక గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. ఆలయంలో వేకువజామున స్వాతి వేడుకలు, గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేక పూజలు అర్చకులు చేపట్టారు. గిరిప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ కోలాట నృత్యాలు, భజనలు, కీర్తనలతో కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర హోరెత్తించారు. గిరిప్రదక్షిణ పూర్తి చేసిన భక్తులు మెట్ల దారిలో కొండెక్కే, భక్తులకు 1,500 మాత్రమే గిరిప్రదక్షిణ ఉచిత దర్శన టికెట్లు అధికారులు పంపిణీ చేశారు. ప్రత్యేక దర్శన క్యూలైన్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించేందుకు అనుమతించారు. అధిక సంఖ్యలో వాహనాలపై తరలిరావడంతో వైకుంఠ ద్వారం రోడ్లు కిలోమీటరు మేర (కూడలి) నిండిపోయింది. వాహనాల పార్కింగ్‌తో ప్రదక్షిణ భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రదక్షిణ చేసిన భక్తులు మధ్యాహ్నం ఆరగింపు సమయం (12 గంటలకు) వరకు సుమారు 10 వేల మంది ప్రదక్షిణ పూర్తి చేసుకున్నారు. ప్రతీనెలా స్వాతి నక్షత్రం రోజున వైకుంఠద్వారం చెంత జరిగే ప్రదక్షిణ ప్రారంభ కార్యక్రమం సందర్భంగా యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ సారథ్యంలో భక్తుల రద్దీని అదుపుచేసేందుకు పోలీసులు బారికేడ్లతో బందోబస్తు నిర్వహించారు.

అష్టోత్తర శతఘటాభిషేక పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి జన్మ నక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థానపరంగా ఆరాధనల అనంత రం ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. తులసీదళాలతో సహస్రనామార్చన లు చేపట్టారు. పండితుల వేద మంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యా ల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారికి ఊంజల్ సేవోత్సవాలు

స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్టింపజేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 13,53,195 ఆదాయం సమకూరింది.

మౌలిక వసతులకు సుమధుర ఫౌండేషన్ సహకారం

నార్కట్‌పల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల విద్యాభ్యాసానికి అయ్యే వనరుల కోసం సుమధుర ఫౌండేషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆ సంస్థ ప్రతినిధులు నీకంఠరామ్, సందీప్ అన్నారు. సుమధుర ఫౌండేషన్ సీఎండీ మధుసూదన్‌గుప్తా జన్మదినోత్సవం సందర్భంగా నార్కట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పెన్నులు, నోటు బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, జైశంకర్, వెంకటేశ్వర్లు, రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

చిట్యాల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఈసం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీసవేతనం అమలుచేయాలని, ఆశాలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం ప్రతినిధులు సైదమ్మ, జయమ్మ, భాగ్య పాల్గొన్నారు.

గుంతలు.. బురదమయం

» అధ్వానంగా అంతర్గత రోడ్లు
» రాకపోకలకు తీవ్ర అసౌకర్యం
» సమస్యను పరిష్కరించాలని కాలనీవాసుల వేడుకోలు



నార్కట్‌పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రానికి శివారులో ఉన్న వైఎస్ఆర్ కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. అసలే మట్టి రోడ్లు ఆపై ఏళ్ల తరబడి నిర్వహణ కొరవడింది. ఇంకేముందీ దారిపొడవునా మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో దారి పొడవునా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిండి రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. సమీపంలోని లక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చిన్నపిల్లలను పంపాలంటే తల్లులు తమ పిల్లలను భుజాన ఎత్తుకుని వెళ్లి దింపాల్సి వస్తుంది. తమ కష్టాలు ఎవరికీ పట్టడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బలహీనవర్గాల గృహాల కోసం..

బడుగు, బలహీన వర్గాల వారికి సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో మంత్రి వెంకటిరెడ్డి చొరవతో సుమారు 20 ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వంతో కొనుగోలు చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేశారు. ఒక్కోటి 121 గజాల చొప్పున కాలనీలో మొత్తం సుమారు 530 కి పైగా ప్లాట్లు చేశారు. వీటిలో సగానికి పైగా బలహీన వర్గాల వారికి దాదాపు 20 సంవత్సరాల క్రితం ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. లే అవుట్‌లో 30 ఫీట్ల వెడల్పుతో ప్రధాన రోడ్లను, 20 ఫీట్ల వెడల్పుతో కాలనీ రోడ్లను వేశారు. ఈ రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాల్సి ఉంది. కానీ సంవత్సరాలు గడుస్తున్నా కాలనీలోకి ప్రవేశించే ప్రధాన రోడ్లనైనా సీసీ రోడ్లుగా మార్చలేదు. వైఎస్ఆర్ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నేతలు ఇచ్చే హామీలు అమలుకావడం లేదు.

అస్తవ్యస్తంగా మట్టి రోడ్లు ..

దాదాపు 20 సంవత్సరాల క్రితం వేసిన మట్టి రోడ్లు. తర్వాత ఈ కాలనీ అభివృద్ధిని పట్టించుకున్న నాథుడే లేని పరిస్థితి. దీంతో కాలనీలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. సీసీ రోడ్లుగా మార్చకపోవడంతో వర్షాకాలంలో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకల కోసం అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ కాలనీలోని సుమారు 25 నుంచి 35 మంది చిన్నారులు సమీపంలోనే ఉన్న లక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. వర్షాకాలంలో మట్టిరోడ్లపై గుంతల్లో నిలిచిన నీటితో చిన్నారులను ఒంటరిగా పంపలేక తల్లులు వారి పిల్లలను భుజాన ఎత్తుకుని పాఠశాలకు పంపడం సాయంత్రం తిరిగి తీసుకువస్తున్నారు.

ప్రతీ రోజూ పాఠశాలలో దింపుతున్న



వర్షాలు రావడంతో మా కాలనీ ప్రధాన రోడ్లు చాలా దెబ్బతిన్నాయి. గుంతలు ఏర్పడి నీటితో నిండాయి. రోడ్లపై గుంతల్లో నీళ్ల లేనప్పుడు మా భర్త మా పిల్లలను తీసుకెళ్లేవాడు. ఈ దారిగుండా పాఠశాలకు మా ఇద్దరు చిన్న పిల్లలను పంపాలంటే నీటిలో ఎక్కడ పడతారనే భయమేస్తుంది. దీంతో నేనే ప్రతీ రోజు ఉదయం సాయంత్రం చిన్నపిల్లలను భుజాన ఎత్తుకుని బడికి తీసుకువెళ్లి మళ్లీ తీసుకువస్తున్నా.

- కావ్య, వైఎస్ఆర్ కాలనీ

ఎలాంటి ప్రతిపాదనలు లేవు

వైఎస్ఆర్ కాలనీలో రోడ్లను సీసీగా మార్చేందుకు ప్రస్తుతానికి ఎలాంటి ప్రతిపాదనల్లేవు. కాలనీవాసుల ఇబ్బందుల దృష్ట్యా రోడ్ల దుస్థితిని పరిశీలించి ప్రజాప్రతినిధులను సంప్రదించి సీసీ రోడ్లు వేసేందుకు ప్రయత్నం చేస్తాం.

- భరత్‌చంద్ర, పీఆర్‌ఏఈ

మట్టిరోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలి



వైఎస్ఆర్ కాలనీ అంటేనే ఎ వరికీ పట్టనట్లుగా ఉంది. నార్కట్‌పల్లికి దూరంగా ఉన్న మాత్రాన మేం నార్కట్‌పల్లి వాసులం కామా. పట్టణంలోని రోడ్లన్నీ సీసీలుగా మార్చుతున్నారు. వైఎస్ఆర్ కాలనీని రోడ్లను మాత్రం పట్టించుకోరు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి కాలనీలోని ప్రధాన రోడ్లనైనా సీసీలుగా మారిస్తేకాలనీలో తమ ఇళ్లను నిర్మించుకుంటారు.

- కళ్లెం సైదులు, వైఎస్ఆర్ కాలనీ

తైక్వాండో పోటీల్లో రాణించాలి : ఏఎస్పీ

నల్లగొండస్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు రాణించాలని ఏఎస్పీ జి.రమేష్ ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్‌లో సెప్టెంబరు 7వ తేదీ నుంచి నిర్వహించే అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు వి జయం సాధించాలని ఏఎస్పీ జి.రమేష్ కాంక్షించారు. సీబీఎస్ఈ సౌత్‌జోన్ తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారుల్లో 4 బంగారు. 2 వెండి పతకాలు సా ధించారు. శుక్రవారం వారిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ మా ట్లాడుతూ ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచి గెలుపొంది జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ దగ్గుబాటి విమల, తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ ఎండి. యూనుస్ కమాల్, డీవైఎస్‌వో అలీ, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కరీం, కవిత, నజీర్ పాల్గొన్నారు. అదేవిధంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మేకలఅభినవ్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పలువురు క్రీడా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధ్యాన్‌చంద్ హాకీ క్రీడకు, దేశానికి అందించిన సేవలను గుర్తుచేశారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



యాపలగూడెంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న సుధాకర్‌రెడ్డి

తిప్పర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డి-40 కాల్వల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై చేపట్టిన అధ్యయన యాత్ర మండలంలోని ఇండ్లూరు, మామిడాల, ఆరెగూడెం, యల్లమ్మగూడెం, యాపలగూడెం, సర్వారం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీటి సమస్యల కారణంగా పాలేరు వాగుపైన మామిడాల, ఆరెగూడెం గ్రామల మధ్యలో రెండు చెక్‌డ్యాంలు నిర్మించి మూసీ ఎల్ 33 కెనాల్‌కు లైనింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలోని లింకు రోడ్లను తారు రోడ్లుగా మార్చాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మామిడాల నుంచి గోదారిగూడెం మీదుగా చిరుమర్తికి వెళ్లే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో అపరిశుభ్రత ఎక్కువగా ఉందని, అధికారులు పర్యవేక్షించి వెంటనే గ్రామాల్లో పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్వారం గ్రామం నుంచి మామిడాలకు, యాపలగూడెం నుంచి కొయ్యలపాడు గ్రామాలకు లింకు రోడ్లను వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు నన్నూరి వెంకటరమణారెడ్డి, మండల కార్యదర్శి మన్నెం భిక్షం, నాయకులు గండమళ్ల రాములు, దొంగరి వెంకన్న, బీమగాని గణేష్, జంజరాల సైదులు, ఉమా, పోకల శశీదర్, పేరం లింగయ్య, ఆవుల సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, బీమనబోయిన సోములు, నాగయ్య, లింగయ్య, సంజీవరెడ్డి, నరేష్, సైదులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో

లక్ష్మీగణపతి కుంకుమార్చన

కనగల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం వినాయకుడి విగ్రహం వద్ద శ్రీలక్ష్మీగణపతి కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఈ పూజల్లో ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతులు కమిటీ సభ్యులు, ధర్మకర్తలు పాల్గొన్నారు. అనంతరం వారు ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ ముఖ్య అర్చకులు మాల్లాచారి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.



నార్కట్‌పల్లి మండలంలోని గుమ్మలబావిలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి



నల్లగొండ పట్టణంలోని సావర్కర్‌నగర్‌లో వినాయక మండపం వద్ద శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సమస్యలను విస్మరించిన ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి వ్యవహరిస్తుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. కట్టంగూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఆచరణకు సాధ్యం కాని హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా యూరియా కొరత ఏర్పడిందని దీంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎరువుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, నాయకులు చెవుగోని జనార్థన్, నోముల వెంకటేశ్వర్లు, దాసరి సంజయ్, సుధాకర్, సైదు లు, ఉత్తరయ్య, పోగుల అంజయ్య, మల్లేష్, యాదయ్య, సై దులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై విచారణ జరిపించాలి

● మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నల్లగొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలకు సంబంధించి జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు కలెక్టర్ కార్యాలయంలో ఓటరు జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వినతిపత్రం అందజేశారు. అయితే మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు తమ నియోజకవర్గంలోని ఓటరు జాబితాలోని అవకతవకలపై వినతి పత్రం అందచేస్తున్న క్రమంలో కలెక్టర్ 'ఇది ప్రజావాణి కాదు' అనడంతో ఆయన నొచ్చుకొని సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించి అనేక గ్రామాల్లో ఓటర్ లిస్టులలో వార్డుల విభజనలో జరిగిన అవకతవకలు జరిగాయన్నారు. నల్లగొండ మండలం రెడ్డి కాలనీలో గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో ఆ గ్రామ జనాభా కంటే ఎక్కువగా ఓటర్లు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. అంతకుముందు ఉన్న ఉమ్మడి గ్రామ పంచాయతీలోని సందెనపల్లిలోని ఓటర్లు సుమారు 60 ఇతర గ్రామాలకు సంబంధించి కొన్ని ఓట్లు జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. తిప్పర్తి మండలం సర్వారం, రామలింగాలగూడెం గ్రామపంచాయతీ లోని వార్డుల విభజనలో గ్రామంలో ఉన్న ఓట్లను వార్డుల వారీగా సగటుగా విభజించకుండా ఇష్టం వచ్చిన రీతిలో ఒక్కొక్క వార్డుకు ఓట్లను కేటాయించడంతో ఆ వార్డులోని రిజర్వేషన్లపై ప్రభావం చూపడమే కాకుండా వార్డు అభ్యర్థి గెలుపు, ఓటమిపై ప్రభావం చూపుతుందన్నారు. ఇలా నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో ఈ విధమైన లోటుపాట్లు జరిగాయన్నారు. తక్షణమే ఓటర్ జాబితాలను పున సమీక్షించి అభ్యంతరాలకు తగు అవకాశం, సమయం కేటాయించి, పూర్తి విచారణ జరిపి కొత్త ఓటర్ లిస్టులను ప్రచురించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, మండల పార్టీ అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, బక్క పిచ్చయ్య. తుమ్మల లింగస్వామి ఉన్నారు.

గ్రామాలకు లింకు రోడ్లు ఏర్పాటు చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రంద అందజేస్తున్న బీజేపీ నాయకులు

గట్టుప్పల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి గ్రామాలకు లింకు రోడ్లు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనబోయిన దేవేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో, తహసీల్దార్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని, పారిశుధ్యం లోపించడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వీధికుక్కల నివారణ, వీధి దీపాలు నిర్వహణపై దృష్టి సారించి వెలిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రావుల ఎల్లప్ప, ఓబీసీ ఉపాధ్యక్షుడు కంపె దుర్గయ్య, నాయకులు జంపాల సుధాకర్, ఏలే మారయ్య, ప్రధానకార్యదర్శులు ఇడం రాజు, నాగులగాని శ్రీనివాసులు, రాపోలు మార్కండేయ, పగిళ్ల శ్రీను, కుండె శ్రీశైలం, మాదగాని బిక్షం, ప్రవీణ్, రాజు, బొట్ట సైదులు, బోయపల్లి లోగిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష తెలుగును మరవద్దు

కేతేపల్లి, ఆగస్టు 29: అమ్మలాంటి కమ్మనైన మాతృభాష తెలుగును మరవవద్దని బీమారం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.భిక్షమయ్య అన్నారు. గిడుగు రాంమూర్తి జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని బీమారం జడ్పీపాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పాలన్నారు. పర భాష మోజులో పడిన నేటి తరం మాతృబాషను నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. రెండు వేల ఏళ్ల చరిత్ర గల తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాపోలు పరమేష్, డి.నాగయ్య, బి.జానకిరెడ్డి, జి.రమేష్, కన్నె శివయ్య, జి.వెంకటేశ్వర్లు, ఎల్.శ్రీధర్, ఎం.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

2,3న మండలస్థాయి టోర్నమెంట్

మర్రిగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ మర్రిగూడ మండల స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్ సెప్టెంబరు 2,3 తేదీల్లో జడ్పీహెచ్‌ఎస్ మర్రిగూడ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో బిట్టు శ్రీను తెలిపారు. శుక్రవారం మండల వనరుల కార్యాలయంలో నిర్వహించిన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల పీడీలు, పీఈటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు వాసుదేవరావు, వేదవతి చిన్న జంగయ్య, నరసింహ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెర్వును పర్యాటక స్థలంగా తీర్దిదిద్దాలి



ఐబీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పెద్ద చెరువును పర్యాటక స్థలంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే వేముల వేరేశం అధికారులకు సూచించారు. పెద్దచెర్వు అభివృద్ధిపై ఎమ్మెల్యే వీరేశం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నల్లగొండ డివిజన్ పరిధిలోని నీటిపారుదల శాఖ అధికారులతో నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో చెర్వు అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై కూలంకశంగా చర్చించి, తగు సూచనలు చేశారు. భవిషత్‌లో జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లాలో ఇదొక పర్యాటక స్థలంగా ప్రాచుర్యం వచ్చేలా సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. దీనికి అనుగుణంగా ప్రతిపాదనలు నమూనా తయారు చేయాలని ఐబీ అధికారులను ఆయన ఆదేశించారు. చెర్వు కట్ట వెడల్పు పెంచి రోడ్డు నిర్మించి కట్టపై రాకపోకలు సాగే విధంగా చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా వాకింగ్ ట్రాక్ విత్ గార్డెనింగ్, లైటింగ్, చిన్నపిల్లలు ఆడుకునేలా ఏర్పాట్లు, కుటుంబ సమేతంగా వచ్చి కట్టపై ఆహ్లాదాన్ని ఆస్వాదించేలా నమూనా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. రెండు చోట్ల బతుకమ్మ ఘాట్‌లను నిర్మించాలని, చెర్వు వద్దకు సందర్శకులకు పర్యాటకులు సులువుగా చేరుకునేలా రోడ్డు సౌకర్యం కల్పించాలని ఐబీ అధికారులను వీరేశం ఆదేశించారు. వీలైనంత త్వరగా ప్రతిపాదనలు తయారు చేస్తే ప్రభుత్వం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. సమీక్ష సమావేశంలో డీఈఈలు విఠలేశ్వర్, మారం శ్రీనివాస్ తదితర ఏఈఈలు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ బహూకరణ

చిట్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిపాలిటీలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రానికి పట్టణానికి చెందిన కొరివి వెంకన్న, అరుణ దంపతులు స్మార్ట్ టీవీని శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది దాతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు అపర్ణ, జ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

మునుగోడురూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్ర్య సమర యోధుడు గురునాథ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. మండలంలోని పలివెల గ్రామంలో శుక్రవారం గురునాథ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో గురునాథ్‌రెడ్డి కుటుంబసభ్యులు కొండవీటి రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కొండా స్వరాజ్యం, గోనుకొండ ఎట్టయ్య, గుత్తి మారయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలి

మునుగోడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మునుగోడు నుంచి కచలాపురం, పలివెల, కోతులారం, సర్వేల్, మీదుగా గుడిమల్కాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునుగోడు మండల కేంద్రంలో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు వెళ్లాలంటే దగ్గరగా ఉన్న మునుగోడు- గుడిమల్కాపురం రోడ్డు బాగు చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మిర్యాల భరత్‌కుమార్, యాసరాణి శ్రీను తదితరులు ఉన్నారు.



మునుగోడులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వర్షాలకు తెగిన రహదారులను మరమ్మతు చేయించాలి

నల్లగొండ రూరల్ : ఇటీవల కుర్సిన వర్షాలకు కారణంగా మండలంలోని ఖాజీరామారంలో లింకు రోడ్లు వరదలకు తెగిపోయాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై చేపట్టిన సర్వేలో భాగంగా శుక్రవారం మండలంలోని ఖాజీరామారంలో గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొత్త కుంట కట్ట తెగిపోవడంతో రైతుల పొలాలకు ఇసుక మేట చేరి తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పుచ్చకాయల నర్సిరెడ్డి, కొండ అనురాధ, మండల కార్యదర్శి నలుపరాజు సైదులు, మండల కమిటీ సభ్యులు కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఖాజీరామారంలో తెగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు


బురద రోడ్లలో సీపీఎం ఆధ్వర్యంలో వరి నాట్లు

శాలిగౌరారం: మండలంలోని గ్రామాల్లో బురదమయంగా మారిన అంతర్గత రోడ్లన్నీ అధ్వాన స్థితిలో ఉన్నందుకు సీపీఎం ఆధ్వర్యంలో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు, సీపీఎంపోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధిలో బాలిశెట్టిగూడెంలో వరి నాటు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య మాట్లాడారు. నాయకులు మక్క బుచ్చి రాములు, వెంకన్న, అవనిజ, మక్క మేరమ్మ, బల్లెం వెంకటయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 21.0

ANDHRAJYOTHY



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	2,88,545	2,88,545
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	10,700.88	10,400.36
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.766 (39.4563)	2,70,660	2,13,987

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

పీఏసీఎస్‌ల సీఈవోల బదిలీలకు
హైకోర్టు బ్రేక్



- తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు
- సొసైటీల్లో కొనసాగుతున్న అనిశ్చితి
- డీఫాల్టర్‌గా ఉన్న సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లు?
- పాలకవర్గాల గడువు పెంపుపై ఇంకా సందిగ్ధమే

ప్రాథమిక సహకార సంఘాల్లో ఏళ్లతరబడి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న సీఈవోలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారులు నాలుగు రోజుల క్రితం బదిలీ చేశారు. అయితే బదిలీ అయిన సీఈవోలు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో బదిలీలకు శుక్రవారం బ్రేక్‌లు వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తాత్కాలికంగా బదిలీలు నిలుపుదల చేసిన హైకోర్టు అక్టోబరు 7వ తేదీ నాటికి కేసును వాయిదా వేసింది. ఈలోగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది.సీఈవోల బదిలీలను తాత్కాలికంగా నిలిపివేసిన హైకోర్టు ఆరు నెలల పాటు బదిలీలను నిలుపుదలచేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో బదిలీలు అయిన సీఈవోలంతా పూర్వ సొసైటీల్లోనే మళ్లీ పనిచేయాల్సి ఉంటుంది.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో 108 సొసైటీలు ఉండగా, 74 మంది సీఈవోలను బదిలీ చేశారు.మూడు దశాబ్దాలకు పైగా ఒకే ప్రాంతంలో పనిచేసిన వారిని బది లీ చేయడంతో వారు కోర్టును ఆశ్రయించారు. నల్లగొండ జిల్లాలో 27మంది సీఈవోలను, సూర్యాపేట జిల్లాలో 28మందిని, యాదాద్రి జిల్లాలో 20మంది సీఈవోలను అధికారులు బదిలీ చేశారు.అయితే హైకోర్టు ఉత్తర్వులతో వారి బదిలీలు నిలిచిపోయాయి.

ఎలాంటి సౌకర్యాలు లేకుండా బదిలీలా?

తమకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా బదిలీలు చేయడం అన్యాయమంటూ పీఏసీఎస్ సీఈవోలు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. పీఆర్సీ అమలు చేయడం లేదని, పదవీ విరమణ ప్రయోజనాలు ఏమిటన్నది కూడా స్పష్టత లేదని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. సుమారు 30 నుంచి 40 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్న తమను ఇప్పుడు బదిలీ చేస్తే ఉద్యోగ విరమణ సందర్భంగా రావాల్సి ప్రయోజనాలు ఏ సంఘం నుంచి తీసుకోవాలన్నది తెలియడం లేదని, వాటిపై స్పష్టత ఇచ్చాకే బదిలీ చేయాలని సీఈవోలు కోరుతున్నారు. కోర్టు స్టేతో బదిలీ అయిన కార్యదర్శులు ఇప్పుడు వారు పనిచేస్తున్న సంఘాల్లోనే కొనసాగనున్నారు.



సొసైటీల పాలకవర్గం గడువు పెంపుపై అనిశ్చితి

రాష్ట్ర వ్యాప్తంగా డీఫాల్టర్‌గా ఉన్న సొసైటీల్లో చైర్మన్లకు బదులు స్పెషల్ ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం జీవోలో తిరకాసు పెట్టింది. దీంతో డీఫాల్టర్ సొసైటీలో ఉన్న వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఏ సొసైటీకి స్పెషల్ ఆఫీసర్ వస్తారు? ఏ సొసైటీలో చైర్మన్‌కు బాధ్యతలు ఇస్తారనే దానిపై అయోమయం నెలకొంది. జిల్లా సహకార అధికారులకే ప్రభుత్వం ఈ అధికారాన్ని కట్టబెట్టగా, డీఫాల్టర్ సొసైటీల వివరాలను పంపించాలని ఆదేశించింది. దీంతో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సుమారు రూ.3వేల కోట్ల టర్నోవర్‌తో సాగుతున్న నేపథ్యంలో ఎక్కడైనా సొసైటీలు డీఫాల్టర్‌గా ఉన్నట్టు ప్రకటించాలంటే పలు కోణాల్లో విచారణ చేయాల్సి ఉంటుంది.

దీంతో సాధ్యాసాధ్యాలపై జిల్లా సహకార అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎన్ని సొసైటీలు లోన్ రికవరీ చేయకుండా ఉన్నాయి? ఏ సొసైటీ పనితీరు అట్టడుగున ఉందనే దానిపై జిల్లా సహకార అధికారులు సమీక్ష చేస్తున్నా, ఆ వివరాలన్నింటినీ గోప్యంగానే ఉంచుతున్నారు. ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక సమర్పించాల్సి ఉన్నా, ఇంకా ఆదేశాలు రాకపోవడంతో నివేదిక ఆలస్యమైనట్టు సమాచారం. వారం రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లకు సంబంధించి ప్రస్తుతం కొనసాగుతున్న చైర్మన్లకే బాధ్యతలు అప్పగించడంతో పాటు ఆ పాలకవర్గాలు యథావిధిగా కొనసాగుతాయని చర్చ సాగుతోంది.

కార్యకలాపాలు ఎలా?

ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలల పాటు పాలక వర్గాల గడువును పొడిగించాలని నిర్ణయించి ఈనెల 14న ఆరు నెలల గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లా సహకారశాఖ నుంచి అనుబంధంగా

- మిగతా 6వ పేజీలో...

కలెక్టరేట్ గ్రౌండ్ ఫ్లోర్‌ను
డిసెంబరులోగా పూర్తిచేయాలి

భవనం మొత్తాన్ని వచ్చే ఏడాది జూన్ 2 నాటికి పూర్తిచేయాలి



కలెక్టరేట్ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ నూతన భవన గ్రౌండ్ ఫ్లోర్‌ను డిసెంబరులోగా, మొత్తం భవనాన్ని వచ్చే ఏడాది జూన్ 2 నాటికి పూర్తి చేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాత కలెక్టరేట్ వెనుక నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 82వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో నిర్మిస్తున్న ఈ భవనంలో పూర్తిగా రెవెన్యూ విభాగం, కలెక్టర్, అదనపు కలెక్టర్ల ఛాంబర్లు, మంత్రి ఛాంబర్ ఉండాలన్నారు. పాత భవనంలో పూర్తిగా అన్ని శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, అందుకు ఆధునీకరించాలని ఆదేశించారు. కొత్త కలెక్టరేట్‌లో మీటింగ్ హాల్‌ను ఫాల్ సీలింగ్, ఎల్ఈడీ స్ర్కీన్లు, అన్ని సౌకర్యాలతో నిర్మించాలన్నారు. నిర్మాణ అంచనాలను ఎట్టి పరిస్థితుల్లో మార్చకూడదని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి నిలపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. కొత్త కలెక్టరేట్ మిగతా జిల్లాల్లో ఉన్న సమీకృత కలెక్టరేట్ భవనాకలంటే మెరుగ్గా ఉండాలన్నారు. ఈ కార్యాలయ నిర్మాణం పూర్తయితే ఇంతకాలం ఇతర భవనాల్లో ఉన్న డీఈవో, డీఎంహెచ్‌వో కార్యాలయాలను ఇక్కడికి తరలిస్తామన్నారు. అనంతరం బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాహెబ్ దర్గా గుట్టలపై నిర్మిస్తున్న ఘాట్ రోడ్ల పనులను ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. ఘాట్ రోడ్ల నిర్మాణం ఇప్పటివరకు 5కిలోమీటర్లు పూర్తయిందని ఆర్అండ్‌బీ అధికారులు మంత్రికి వివరించారు. సాధ్యమైనంత త్వరగా వీటి నిర్మాణాలను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్అండ్‌బీ సీఈ వెంకటేశ్వరరావు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై
అభ్యంతరాలు తెలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల దృష్ట్యా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30లోగా తెలియజేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 28న పోలింగ్ కేంద్రాలు, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించామన్నారు. వీటిపై అభ్యంతరాలను ఈ నెల 30వ తేదీ వరకు సమర్పిస్తే 31న పరిశీలించి, పరిష్కరిస్తామని, తుది ఓటర్ జాబితాను సెప్టెంబరు 2న ప్రకటిస్తామన్నారు. 30న ఎంపీడీవోలు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో 869 పంచాయతీలు ఉండగా, 7,444 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 10,73,506 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 600 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే మరికొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పలు పార్టీల ప్రతినిధులు కంచర్ల భూపాల్‌రెడ్డి, మల్లికార్జున్, పంకజ్‌యాదవ్, పిచ్చయ్య, లింగస్వామి, యాదగిరి, రఫీక్, నర్సిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లు చేయాలి

సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్



సాగర్‌లోని దయ్యాలగండి వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, వేములపల్లి, హాలియా, నాగార్జునసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జన ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి డివిజన్ పరిధిలోని గణేశ్ విగ్రహ నిమజ్జన ప్రాంతాలైన దామరచర్ల మండలం వాడపల్లి, వేములపల్లి మండల కేంద్రం, అనుముల మండలం 14వ మైలు, పెద్దవూర మండలం నాగార్జునసాగర్ దయ్యాలగండి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సజావుగా సాగేందుకు పారిశుధ్యం, తాగునీరు, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణతో పాటు భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసమూహ నిర్వహణ కోసం పోలీస్ సిబ్బందిని, అత్యవసర అవసరాల కోసం వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం నిర్వహణకు చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, పోలీస్‌సిబ్బంది, విద్యుత్, ఆర్అండ్‌బీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రాప్ సర్వే పక్కాగా నిర్వహించాలి : జేడీఏ

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ క్రాప్ నమోదును పకడ్బందీగా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఘనపురంలో డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సర్వే నెంబర్‌లోని పంటల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సర్వేకు రైతులు సహకరించి పూర్తి సమాచారం అందించాలన్నారు. రైతులకు త్వరితగతిన కావలసినంత యూరియా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు రెండో విడత నానో యూరియాను వినియోగించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి రావుల పాండు, విస్తరణ అధికారి సర్దార్, రైతులు శ్రీనివాస్‌రావు, భద్రయ్య, సాయిలు, యాహస్, తదితరులు ఉన్నారు.

బత్తాయి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



నిడమనూరు : బత్తాయి తోటలను పరిశీలిస్తున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

నిడమనూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఏ.కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుంటిపల్లి, ఎర్రబెల్లి గ్రామాల్లో రైతు కమిషన్ సభ్యులు పర్యటించి బత్తాయి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు కమిషన్ సభ్యులకు ఏకరువు పెట్టారు. నాణ్యమైన మొక్కలు లభించక సరైన దిగుబడి రావడం లేదని, బిందు సేద్య పరికరాలు సైతం రాయితీపై అందడం లేదని, వివిధ రకాల తెగుళ్ల కారణంగా ఎన్ని మందులు పిచికారీ చేసినా నివారించలేకపోతున్నామని వాపోయారు. మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నామని వివరించారు. తిరుపతి నుంచి తెచ్చుకున్న మొక్కలు నాణ్యంగా లేవని, కాయ పరిమాణం రాకముందే రాలిపోతున్నాయని తెలిపారు. మొక్కలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, బత్తాయి రైతుల సమస్యలపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. తొలుత రైతు కమిషన్ బృందానికి తహసీల్దార్ జంగాల కృష్ణయ్య స్వాగతం పలికారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, భూమి సునీల్, భవానిరెడ్డి, కేవీఎన్‌రెడ్డి, బాబు, జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి, ఏడీఏ సరిత, ఏవో మునికృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఏఈవో మహేష్, ఉద్యాన అధికారులు రిషిత, అనంతరెడ్డి, మురళి, శ్వేత, విద్యాసాగర్, నసీమా, నాయకులు నందికొండ మట్టారెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, నూకల వెంకట్‌రెడ్డి, నర్సింగు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన బృందం

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి పంచాయతీలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నారింజ, ఉద్యాన పంటల పరిశోధనల గురించి సీనియర్ సైంటిస్ట్ రాజాగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. నారింజ, నిమ్మ, పామాయిల్ సాగులో సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి యుగంధర్, రైతు సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

పాఠశాలల్లో సాయంకాలం తరగతులు నిర్వహించాలి



ఉరుమడ్లలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

డీఈవో బొల్లారం భిక్షపతి

చిట్యాలరూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్ల పట్టు సాధించేదుకు ప్రభుత్వ పాఠశాలల్లో సాయంకాలం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఉరుమడ్ల, ఎలికట్టె జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి గణితం, హిందీ, సామాన్య సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీ, తరగతుల నిర్వహణ ప్రణాళికలను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం పెంపుపై దృష్టిసారించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను తప్పనిసరిగా అభ్యసించడమే గాక, వాటిపై ప్రగతిని సాధించేందుకు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, నర్సింహ, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం నెరవేర్చాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఉద్యోగ, కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన పాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్, డీపీవోకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమ్మె సమయంలో వాటిని తీరుస్తామని చెప్పిన నేడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు సెలవు ఇవ్వకుండా అధిక పని గంటలతో స్పెషల్ ఆఫీసర్లు వేధిస్తున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 2న ఎంపీడీవో కార్యాలయాల ఉదుట ధర్నాలు నిర్వహిస్తామని, భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు ఎండి.సలీం, మల్లు గౌతమ్‌రెడ్డి, పోలే సాంబయ్య, అవుట రవీందర్, పోలే సత్యనారాయణ, ముత్యాలు, అంజయ్య, సర్వయ్య, జహీర్, అరుణ, జానయ్య, రామలింగయ్య, ఎల్లేష్, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై
ప్రభుత్వాన్ని నిలదీస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ పార్టీని సంప్రదించి వారి కష్టాలను అసెంబ్లీలో ప్రస్తావించాలని, ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరుతున్నారన్నారు. నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్‌తో పాటు నిరుద్యోగ భృతి, విద్యార్థినులు స్కూటీలు, రైతులు రుణమాఫీ, రైతు భరోసా, యూరియా కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరుతున్నారన్నారు. కాళేశ్వరం నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో పెడితే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, తాము మొదటి నుంచి కాళేశ్వరానికి సంబంధించిన అసలు నివేదికను బహిరంగపరచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఓ వైపు రాష్ట్రంలో వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వానికి సోయి లేదని, వరదల సమయంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి పాత పద్ధతుల్లో రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మోసం బయట పడనుండటంతో మరో డ్రామాకు తెరదీసిందన్నారు. హైకోర్టు మూడు నెలల సమయం ఇస్తే రెండు నెలలు నిద్రపోయి ఇప్పుడు హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల కమిషన్ సైతం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, వర్షాలు వస్తుంటే సమగ్రంగా లేని ఓటర్ జాబితాను ప్రదర్శించి ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. గోదావరి, కృష్ణా జలాలు వందలాది టీఎంసీలు సముద్రంలో కలుస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని, నల్లగొండలోని ఉదయ సముద్రానికి నీరు విడుదల చేయడం లేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా మంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. విలేకరుల సమావేశంలో నాయకులు రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, తుమ్మల లింగస్వామి, పాల్గొన్నారు.

నిరీక్షించినా నిరాశే..

- యూరియా కోసం పలుచోట్ల ఆందోళన 7

తప్పొప్పులను సరి చూసుకోవాలి

కొండమల్లేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ఓటరు జాబితాలో తప్పొప్పులను సరి చూసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల్లో డ్రాఫ్ట్ ఓటరు లిస్టులను అధికారులు ప్రదర్శించారన్నారు. ఓటరు లిస్టుపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించారు.

భీమనపల్లి ప్రాజెక్టు పరిశీలన

దేవరకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనంకోసం దేవరకొండ మండలం కొండభీమనపల్లి ప్రాజెక్టును శుక్రవారం దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ పరిశీలించారు. సీఐ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, అధికారులతో కలిసి వెళ్లిన ఆయన అక్కడ పరిస్థితిని సమీక్షించారు. కొండభీమనపల్లి ప్రాజెక్టులోనే గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

● ఎమ్మెల్యే బాలునాయక్



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మార్నింగ్ వాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డిండి మండలకేంద్రంలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలు సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీకి రెండు కళ్లలాంటివన్నారు. గ్రామ స్థాయిలో గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకన్న, సిరాజ్ ఖాన్, వెంకటేశ్వరరావు, నాగార్జునరెడ్డి, రాజేష్‌రెడ్డి, లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, కాశయయ, భాస్కర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో యూరియా అందించాలి

● మాజీ ఎమ్మెల్యే యాదగిరి రావు

చింతపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా అందించాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. శుక్రవారం చింతపల్లి మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, ఉజ్జిని అంజల్‌రావు, కొండల్, వెంకటయ్య, శ్రీశైలం, శేఖరాచారి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు యూరియా అందించకుండా మొండి వైఖరి అవలంబిస్తుందని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు వినతిపత్రం అందించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఇవ్వాల్సిన యూరియా ఇప్పటివరకు అందించలేదన్నారు. కార్యక్రమంలో ధనావత్ శాంత, గజ్జల లక్ష్మీనరసింహారెడ్డి, రాజేష్, వెంకట్‌రెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ గుణవేణి శ్రీనివాస్ అన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై మెప్మా ఆధ్వర్యంలో కార్యాలయంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యజమాని మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం రూ. 20వేల ఆర్థికసాయం అందిస్తుందన్నారు. సమావేశంలో బక్కయ్య, వెంకన్న, పార్వతి పాల్గొన్నారు.

హరికృష్ణ సేవలు చిరస్మరణీయం



హరికృష్ణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నందమూరి హరికృష్ణ తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. హరికృష్ణ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో నందమూరి అభిమానులతో కలిసి హరికృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా విధులు నిర్వహించిన హరికృష్ణ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో వాణిజ్య సెల్ జిల్లా కన్వీనర్ ఏచూరి అనంతరాములు, నాయకులు నసీరుద్దీన్‌బాబా, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, తెలుగు శాఖ అధ్యక్షుడు మల్లిరెడ్డి భీమార్జున్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు, సాహిత్య వైతాళికుడు గిడుగు రామ్మూర్తి జయంతి రోజును తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి సహోపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమాలలో డాక్టర్ నరేష్‌గుమ్మడి, త్రాసు వెంకటరమణ, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలి

వేములపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భీమారం-సూర్యాపేట రోడ్డు విస్తరణలో భాగంగా మిగిలిన పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రెమడాల పరుశురాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో భీమారం- సూర్యాపేట రహదారిపై అసంపూర్తిగా వదిలేసిన పనుల వద్ద ఏర్పడిన నీటి గుంతలో ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. దశాబ్దకాలం గడిచిపోతున్నప్పటికీ రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకుండా ఎక్కడికక్కడ పెండింగ్‌లో ఉండడంతో మండల ప్రజలు, రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రెమడాల భిక్షం, మహేందర్, సైదులు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారులపై వరినాట్లతో నిరసన



రేగులగడ్డలో రోడ్లపై వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

నిడమనూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ప్రజా సమస్యలపై గ్రామాల్లో సీపీఎం చేస్తున్న సర్వేలో భాగంగా శుక్రవారం మండలంలోని రేగులగడ్డ గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా బురదమయంగా మారిన రోడ్లపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, నల్లబోతు సోమయ్య, జగతి, బలరాం, శ్రీలక్ష్మి, ఏడుకొండలు, గంగరాజు, మారయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ

● బిల్లులు, జీతాలకు ఎదురుచూపులే
● దయనీయంగా మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకుల దుస్థితి



వీటీనగర్‌లో రేకుల షెడ్డు కిందే వంట చేస్తున్న నిర్వాహకులు

చింతపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వచ్చేవే అరకొర జీతాలు. అవీ నెల నెలా రావడం లేదు. దీనికితోడు మధ్యాహ్న భోజన బిల్లులూ పెండింగ్‌లోనే. దీంతో ఏజెన్సీలను ఎలా నిర్వహించాలని నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. నిర్వాహకులు రెండు రోజులు కోడిగుడ్లు, మిగతా రోజులు కూరగాయాలు, పప్పులు ఇలా నెలకు రూ.28వేల వరకు పెట్టుబడులు పెడుతున్నారు. సమయానికి బిల్లులు, జీతాలు రాకపోవడంతో అప్పులు తీసుకొచ్చి వంట చేస్తున్నారు. ఐదు నెలలుగా బిల్లులు, జీతాలు సక్రమంగా రాకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వహణకు నానా తంటాలు పడుతున్నారు. అధికారులు అర్థం చేసుకొని తమ సమస్యను పరిష్కరించాలని చింతపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరుతున్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత, హాజరుశాతం పెంచేందుకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే ఈ పథకంలో రోజువారీగా ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.6.78, ఆరు నుంచి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.10.17, తొమ్మిది నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.10.67, గుడ్డుకు రూ.6 చెల్లిస్తారు. కార్మికులకు రూ.3వేల చొప్పున గౌరవ వేతనం అందించాల్సి ఉంటుంది.

చింతపల్లి మండలంలో ఇదీ పరిస్థితి

చింతపల్లి మండలంలో 47 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. వీటిలో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సుమారు 4,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు మొత్తం 95మంది పని చేస్తున్నారు. ఐదు నెలలుగా మధ్యాహ్న భోజనానికి సంబంధించి బకాయి బిల్లులు, జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు పూర్తి స్థాయిలో వంట గదులతోపాటు గ్యాస్ పొయ్యి, సిలిండర్లు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయటే భోజనాన్ని తయారుచేసి విద్యార్థులకు అందిస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతుంది. వంట సామగ్రి నిల్వ చేసుకునేందుకు సక్రమంగా వంటశాల గదులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్‌లో ఉన్న బకాయి బిల్లులు, జీతాలు సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.



వడ్డీలకు తెస్తున్నాం

విద్యార్థులకు మధ్యాహ్న పథకం కింద నిత్యం వంటలు చేసి భోజనం అందిస్తున్నాం. ఐదు నెలలుగా బకాయి బిల్లులు, జీతాలు రాకపోవడంతో అప్పులుచేసి వంట చేసి ఇబ్బందులు పడుతున్నాం. వంట చేసేందుకు పాఠశాలలో వంటగ్యాస్, మౌలిక వసతులు కల్పించాలి.

● తిరుపతమ్మ, ఏజెన్సీ నిర్వాహకులు, వీటీనగర్ జడ్పీహెచ్ఎస్



బిల్లులు మంజూరు చేయాలి

విద్యార్థులకోసం అప్పులు చేసి వంట చేయాల్సి వస్తుంది. రుచికరమైన భోజనం కోసం అప్పులు చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్నాం. అధికారులు గుర్తించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలి.

● శెట్టిపల్లి పుష్ప, ఏజెన్సీ నిర్వాహకురాలు, వీటీనగర్



ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

మధ్యాహ్న భోజన నిర్వాహకులు బిల్లులు విడుదల చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. త్వరలోనే బిల్లులు వచ్చే అవకాశం ఉంది.

ఎన్.అంజయ్య, ఎంఈవో, చింతపల్లి

కల్యాణం.. కమనీయం



దామరచర్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లి గ్రామంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు కెతావత్ శంకర్‌నాయక్, మంకెన కోటిరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో మంది భక్తులు హాజరుకాగా, ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

దూరవిద్యతో కలలు సాకారం

● బీఆర్ఏవోయూ జేడీ ధర్మానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మానాయక్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న దూరవిద్య ప్రజల కలలను సాకారం చేస్తోందని బీఆర్ఏవోయూ జేడీ ధర్మానాయక్ అన్నారు. పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యయన కేంద్రంలో అభ్యసించిన అభ్యర్థులు ఉన్నత కొలువులు అధిరోహించడం హర్షనీయమన్నారు. కుటుంబ, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా బాల్యంలో విద్యకు దూరమైన వారికి బీఆర్ఏవోయూ దేవాలయంగా మారిందన్నారు. వీసీ ఘంటా చక్రపాణి ఆదేశాలతో విద్యా సేవలను మరింత విస్తరించేందుకు కోయ, చెంచులు, థర్డ్‌జెండర్లు, దివ్యాంగులకు ఉచితంగా విద్యనందిస్తున్నామన్నారు. అభ్యర్థుల ఆసక్తి, అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 10 స్టడీ సెంటర్ల ద్వారా వేలాది మందికి దూరవిద్యను అందిస్తున్నామని, మరో రెండు సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అడ్మిషన్లు పెంచేందుకు స్టడీ సెంటర్ల వారీగా కౌన్సిలర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రెడ్యానాయక్, ప్రిన్సిపాల్ భీమార్జున రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, స్టడీసెంటర్ కోఆర్డినేటర్ నాగరాజు, డాక్టర్ నరేష్‌గుమ్మడి, వెంకన్న, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గణపతి బప్పా మోరియా

● గణనాథునికి కొనసాగుతున్న పూజలు

చింతపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మండలంలోని గొడకొండ్ల, ఎం.మల్లేపల్లి, కుర్మపల్లి, వింజమూర్, వీటీనగర్, పోలేపల్లిరాం నగర్, తక్కళ్లపల్లి, నెల్వలపల్లి, తదితర గ్రామాల్లో భక్తులు గణనాథునికి పూజలు నిర్వహిస్తున్నారు. గొడకొండ్ల గ్రామం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మాజీ ఛైర్మన్ గజ్జి కృష్ణ, మహేశ్వరి, బాదేపల్లి నిరంజన్ గౌడ్, లాలుగౌడ్, శ్రవణ్, అర్చకులు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, బాదేపల్లి శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

హాలియా, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హాలియా మునిసిపాలిటీ సాయిప్రతాప్‌నగర్ కాలనీలోని వినాయక మండపం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి, చారి, హరి, సురేష్, సాయి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.





చింతపల్లి మండలం గొడకొండ్లలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు, హాలియాలో కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు

పాలకుల విధానాల్లో మార్పురావాలి

● వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాజకీయం, అధికారం కోసమే పాకులాడకుండా ప్రజాసమస్యలపై దృష్టిసారించేలా పాలకుల విధానాల్లో మార్పురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 65శాతం ప్రజలు ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని పాలకులు నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా వ్యవసాయ ప్రణాళిక రూపొందించకపోవడంతో వానాకాలంలో సాగు అవసరాలకు సరిపడా యూరియాను సరఫరా చేయలేక పోతున్నారన్నారు. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం నిర్లక్ష్యం వైఖరి అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో 15లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, కేంద్రం 9.8లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించిందని, ఇప్పటివరకు అందులో 5లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే బఫర్ స్టాక్ నిల్వ చేసుకోకపోవడంతో యూరియా కోసం రైతులు వరుసల్లో నిలబడాల్సి వస్తుందన్నారు. బత్తాయి తోటల రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవుతోందన్నారు. మార్కెట్ సౌకర్యం లేక, జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మాణం చేయకపోవడంతో అనేకమంది రైతులు బత్తాయి తోటల సాగుకు స్వస్తి పలుకుతున్నారన్నారు. జిల్లాలోని పండ్ల తోటల రైతులకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. వర్షాల కారణంగా జిల్లాలో అనేక చోట్ల వంతెనలు తెగిపోయి, రోడ్లు ధ్వంసమయ్యాయన్నారు. కొన్ని ఇళ్లు నేలమట్టమై పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. వర్షాలకు నష్టపోయిన వారి వివరాలను సేకరించి పరిహారం అందించాలన్నారు. వర్షాలు, వరదల కారణంగా దోమలు, కీటకాలు వ్యాప్తి చెంది ప్రజలు విషరోగాల బారిన పడుతున్నారన్నారు. అన్ని ఆస్పత్రులతో రోగులతో కిటకిటలాడుతున్నాయన్నారు. సకాలంలో వైద్యం అందక మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి తక్షణ వైద్యం అందించే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, వన్‌టౌన్, టూటౌన్ కార్యదర్శులు మల్లు గౌతంరెడ్డి, బావాండ్ల పాండు, జిల్లా కమిటీ సభ్యుడు రెమిడాల పరుశరాములు, నాయకులు అప్పారావు, నగేశ్, పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

● దేవరకొండ ఏఎస్పీ మౌనిక



దేవరకొండలో క్రీడా దినోత్సవ జ్యోతితో ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ మౌనిక

దేవరకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మేజర్ ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవరకొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీని ఏఎస్పీ మౌనిక ప్రారంభించి మాట్లాడారు. యువత, విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ర్యాలీగా స్పోర్ట్స్ అసోసియేషన్ భవన్‌కు చేరుకొని ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, సీఐ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవీ లత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు లలిత, కృష్ణ, అధ్యాపకులు రఘు, బాలకృష్ణ, శివ, సైదులు, అర్జున్, నవ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలుగు బాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవో వెంకటయ్య సూచించారు. మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మండలస్థాయి క్రీడకారుల ఎంపికలో భాగంగా మొదటిరోజు శుక్రవారం అండర్-14, అండర్-17 బాలికలకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ చదువుతోపాటు ఆటలు ముఖ్యమని, ఆటల వల్ల శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, గుడిపల్లి ఎంఈవో సముద్రాల శ్రీనయ్య, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ సీహెచ్ ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా పశువైద్యాధికారి రమేష్



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి రమేష్

మాడ్గులపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గొర్రెల కాపలదారులు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి వి.రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలో జీవాలకు నిర్వహిస్తున్న పీపీఆర్ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి అనంతరం మండల పశువైద్య కార్యాలయంలో రికార్డులను తనిఖీచేసి మాట్లాడారు. పశువైద్యులు పశు పోషకులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, జీవాలకు వ్యాక్సినేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని, ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి రైతులు, పశుపోషకులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా మండల పశువైద్యుడు వినయ్‌కుమార్ జిల్లా పశువైద్యాధికారితో మాట్లాడుతూ మండల పశువైద్యశాల సొంత భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఉండడం వల్ల పశువైద్యశాలకు వచ్చే పశువులు, వాహనాల రద్దీ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో పశువులకు వైద్యం సరిగా అందించలేకపోతున్నామని వివరించారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో సంప్రదిస్తానని జిల్లా పశువైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: మహవతార్ నరసింహ రాఘవ: కూలీ, విట్రోస్: కూలీ, పరదా, బన్ బటర్ జామ్ దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : మహా అవతార్ నర్సింహ